క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి ఆర్థిక సాయం

కర్నూలు(అర్బన్): ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెసనల్స్ (ఆవోపా) ఆధ్వర్యంలో స్వామి వివేకానంద సంస్కృత ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సి.శకుంతలకు దాత అందించిన రూ.5,500 చెక్కును అందించినట్లు ఆవోపా అధ్యక్షులు మేడా వెంకటసురేష్ తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా ఈ పాఠశాలలో పని చేస్తున్న టీచర్‌కు ఆవోపా ఆధ్వర్యంలో ప్రతి నెలా ఆర్థిక సహకారం అందిస్తున్నామని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలు ఇస్కాల మురళి, లక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. కోశాధికారి పురుషోత్తం ,హెడ్‌మాస్టర్ నీలవేణి, ఎస్‌జేటీ సుబ్బలక్ష్మయ్య పాల్గొన్నారు.

విలువిద్య పోటీల్లో సత్తా



కాంస్య పతకం సాధించిన సాయిగీతిక

కర్నూలు (టౌన్): విజయవాడ పట్టణంలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన సీనియర్ స్త్రీ, పురుషుల రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో కర్నూలుకు మూడవ స్థానం దక్కింది. కర్నూలుకు చెందిన సాయి గీతిక ఈ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించింది. రాష్ట్ర స్థాయిలో మూడోస్థానం సాధించిన ఈ క్రీడాకారిణి ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జంషెడ్పూర్‌లోని టాటానగర్ పట్టణంలో జరిగే జాతీయస్థాయి విలువిద్య పోటీల్లో పాల్గొంటున్నట్లు జిల్లా విలువిద్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరత్నమయ్య శుక్రవారం వెల్లడించారు. జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థినిని పలువురు క్రీడాభిమానులు, క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్ మండలం గుమ్మితం తండా గ్రామ పరిధిలోని గ్రీన్ కో కంపెనీ నిర్మాణ పనుల్లో ప్రమాదవశాత్తు మరణించిన బిహార్‌కు చెందిన సోహాల్ అన్సారీ కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం కర్నూలులో సోహాల్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖ చేపడుతున్న అభివృద్ధి పనులలో భాగంగా స్థానిక పాత బస్టాండ్ పోలీస్‌క్వార్టర్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని వీధులు, కాలనీలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధితులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కర్నూలు న్యూసిటీ: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడే వన్ స్టాప్ సెంటర్‌లో ఉండే బాధితుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మహిళా కమిషన్ సభ్యులు రుభియా బేగం హెచ్చరించారు. ఆమె శుక్రవా రం వన్‌స్టాప్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేశా రు. రికార్డులను పరిశీలించారు. అక్కడి బాధితులతో మాట్లాడారు. సిబ్బందితో పలు అంశా లతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ బాల్య వివాహాలను కట్టడి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. డీసీపీఓ శారద, అర్బన్ సీడీపీఓ అనురాధ, అడ్మినిస్ట్రేటర్ మేరి స్వర్ణలత సిబ్బంది, పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ అసిస్టెంట్ సెక్రటరీ బదిలీ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీలో అసిస్టెంటు సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న రహిమాన్‌ను ఆన్‌డ్యూటీపై బదిలీ చేస్తూ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీలో అసిస్టెంటు సెక్రటరీ పోస్టులు ఉన్నాయి. ఇందులో ఒక్క పోస్టు మాత్రమే ఉంచాలనే లక్ష్యంతో మార్కెటింగ్ శాఖ ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఓడీపై రహిమాన్‌ను బదిలీ చేసినట్లు సమాచారం . ఈయన ఖాళీగా ఉన్న పాణ్యం మార్కెట్ కమిటీ సెక్రటరీగా నియమితులయ్యారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన

కల్లూరు: మండల పరిధిలోని పెద్దటేకూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ విద్యార్థులకు ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఫ్లోరోసిస్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ, చుట్టా, సిగరెట్, తంబాకు, పాన్ మసాల, వంటి వాటిని ఉపయోగించడం వల్ల ఫ్లోరోసిస్ సంబంధిత ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అధిక స్థాయిలో ఫ్లోరైడ్ కలిగిన ఆహార పదార్థాలు తీసుకున్నా ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉందన్నారు. ఫ్లోరోసిస్ వలన వికారము, వాంతులు, ఆకలి మందగించడము, కడుపు నొప్పి, కడుపు ఉబ్బరము, దంతాలు రంగు మారడం, తరచుగా మూత్రము రావడము, అధికంగా దాహం, కండరాలు, కీళ్ల నొప్పులు ఎక్కువగా వస్తాయన్నారు. తాజా ఆకు కూరలు, పాలపదార్థాలు, తాజా పండ్లు, విటమిన్-సి ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. హెచ్ఎం సురేష్ కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్సీ సంక్షేమ సంఘం నేతలు,



నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

కర్నూలు(అర్బన్): దేశంలోని బడుగు, బలహీన వర్గాలు, దళితులకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశాకిరణంలా రాజ్యాంగాన్ని రచించడం వల్లే ఆయా వర్గాలకు హక్కులు, రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు అమలవుతున్నాయని ఏపీ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్‌లోని ఆయన విగ్రహానికి పలు ప్రజా, దళిత సంఘాలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం ఆధ్వర్యంలో టౌన్ మోడల్ స్కూల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు దళితుల ఐక్య పాదయాత్ర నిర్వహించారు. సీనియర్ న్యాయవాది వై.జయరాజ్, సంఘం గౌరవాధ్యక్షులు ఎన్‌సీహెచ్ బజారి, ఉపాధ్యక్షుడు సీ.సుంకన్న, ప్రధాన కార్యదర్శి నాయకల్లు సుంకన్న, కోశాధికారి సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

☛ మాధవీనగర్ మాల మహానాడు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి మాల యువ మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యాట ఓబులేసు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు మౌనంగా ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గాల ప్రజలు ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు.నాయకులు సూర్య, సందీప్, అనీల్, రాజు, మౌళి, సంపత్ తదితరులు పాల్గొన్నా రు.

☛ పాతబస్టాండ్ సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గిరిజన సంఘాల నాయకులు నివాళులర్పించారు. లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కైలాసనాయక్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజునాయక్, ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వై.రాజు తదితరులు పాల్గొన్నారు.

☛ అశోక్‌నగర్‌లోని రాయలసీమ మహిళా సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వసతి గృహంలో అంబేడ్క జయంతి కార్యక్రమం నిర్వహించారు.మహిళా సంఘం అధ్యక్షురాలు శకుంతల మాట్లాడుతూ.. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రతిజ్ఞ తీసుకొని ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

☛ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్థికవేత్తగా, పరిపాలనా సంస్కర్తగా చేసిన ప్రతిపాదనలు ఆధునిక భారతావనికి మార్గదర్శకంగా నిలిచాయని ఆర్ వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్ అన్నారు. వర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్, ప్రిన్సిపాళ్ల ఎన్.నరసింహులు, సీవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

☛ డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ పీఎస్ షావలిఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్‌బాషా, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ పాల్ కృపాకర్, డాక్టర్ బి.వెంకటప్ప, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌యూలో నివాళులర్పిస్తున్న అధికారులు

☛నేషనల్ లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో మహా పరినిర్వాణ దివస్ (వర్ధంతి) కార్యక్రమం నిర్వహించారు. ఫోరం అధ్యక్షుడు వై.జయరాజ్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఫోరం నాయకులు మాదన్న, సుబ్బయ్య, నిత్యజీవరాజు, చంద్రుడు, రవిరాజు, మహేష్, రామకృష్ణుడు, అయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (టౌన్): నవ సమాజ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ అని నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్ర బాబు అన్నారు. స్థానిక నగరపాలక కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి కమిషనర్, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ పనిచేయాలని కమిషనర్ సూచించారు. మేనేజర్ చిన్నరాముడు, సూపరింటెండెంట్లు రామకృష్ణ, వాజిద్, స్వర్ణలత పాల్గొన్నారు.



వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో..



నివాళులర్పిస్తున్న నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు(సెంట్రల్): స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా, నాయకులు దామోదరం రాధాకృష్ణ, వెంకటరెడ్డి, బతుకన్న పాల్గొన్నారు.

☛ ఇందిరాగాంధీ నగర్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నాయకులు ఎం.భాస్కర్, టి.రాముడు అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు పోరాటాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): రాజ్యాంగ నిర్మాత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి అన్నారు. శుక్రవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసిస్టెంటు సెక్రటరీ లు వెంకటేశ్వర్లు, రహిమాన్, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, ఎస్‌పి కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

కర్నూలు: అతి మూత్ర వ్యాధి సమస్యతో బాధపడుతున్న వృద్ధుడు బాలయ్య (63) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కల్లూరు మండలం శరీన్ నగర్ శివారులోని పద్మావతి నగర్‌లో ఈయన నివాసముంటాడు. కొంతకాలంగా జబ్బు తీవ్రం కావడంతో మనస్తాపం చెంది శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఉరి నుంచి తప్పించి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య భాగ్యమ్మతో పాటు కుమారుడు, నలుగురు కూతుర్లు సంతానం ఉన్నారు. కు టుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్యాపిలి మండలం రాచర్ల గ్రామానికి చెందిన వడ్డె అచ్చన్న (38) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఉపాధి నిమిత్తం ఈయన కర్నూలుకు వలస వచ్చాడు. కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. అర్ధరాత్రి సమయంలో రోడ్డుపై కాలినడకన వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. శుక్రవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి విచారణ చేపట్టారు.

9న ఆర్చరీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపులోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల మైదానంలో ఈనెల 9వ తేదీన జిల్లాస్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ బాలబాలికల టోర్నమెంట్-కమ్- సెలెక్షన్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈనెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు రాజమండ్రి పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 2008 సంవత్సరం తరువాత జన్మించిన వారు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 93938 55460 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మార్కెట్లోకి న్యూ అమేజ్ కారు



మార్కెట్లోకి న్యూ అమేజ్ కారును విడుదల చేస్తున్న కెనరా బ్యాంకు ఆర్ఎం సుశాంత్‌కుమార్

కర్నూలు (టౌన్): మార్కెట్లోకి న్యూ అమేజ్ కారు విడుదలైంది. నగర శివారులోని సంతోష్‌నగర్‌లో శుక్రవారం అధీకృత డీలర్ ప్రీమియం హోండా షోరూంలో నూతన కారు అవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నివేదిత రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. 3వ జనరేషన్ వాహనం న్యూ అమేజ్ అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించినట్లు చెప్పారు. కారు ధర రూ.7.99 లక్షలు ఉందని, మూడు వేరియంట్లలో అందుబాటులో ఉందన్నారు. సంస్థ ఏజీఎం బాబా వలి, సర్వీస్ జీఎం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ రంగానికి ప్రోత్సాహం



మాట్లాడుతున్న కెనరా బ్యాంకు ఆర్ఎం సుశాంత్‌కుమార్

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కెనరా బ్యాంకు అన్ని విధాలా సహకరిస్తుందని ఆ బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్ చెప్పారు. శుక్రవారం కర్నూలులోని ఉద్యాన భవన్‌లో ఎంఎస్ఎంఈ ఏర్పాటుకు సంబంధించి రుణాల మంజూరుపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కెనరా బ్యాంకు అవగాహన సదస్సు నిర్వహించింది. ఆర్ఎం సుశాంత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంఎస్ఎంఈ రంగానికి రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సులభ రుణ విధానం, తక్కువ వడ్డీరేటు, వంటి సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు.అలాగే వ్యక్తిగత, విద్యా, వ్యాపార రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఎల్‌డీఎం రామచంద్రరావు మాట్లాడుతూ.. జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఎంఎస్ఎంఈ రుణాలను వినియోగించుకొని పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఎంఎస్ఎంఈ సులభ్ ఆఫీసు ఇన్‌చార్జ్ రమేష్‌ప్రభు, రీజినల్ ఆఫీసు ప్రతినిధులు నరేష్, వివిధ బ్యాంకుల అధికారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

కల్లూరు: మండల పరిధిలోని పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు శుక్రవారం ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. హెల్త్‌కేర్ విద్యార్థులు పెంచికలపాడు గ్రామంలోని విశ్వభారతి హాస్పటల్‌ను సందర్శించారు. డాక్టర్ సైఫుల్లా విద్యార్థులకు ప్రథమచికిత్స, సీపీఆర్, ఐసియూ, అత్యవసర కేసుల గురించి వివరించారు. ఎలక్ట్రికల్ విద్యార్థులు కె.నాగలాపురంలోని 33కెవి/ 11కెవి సబ్‌స్టేషన్ సందర్శించారు. విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫర్మర్‌ల పని తీరు గురించి ఆపరేటర్ శ్రీధర్‌రెడ్డి వివరించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సాయి అక్షితను అభినందిస్తున్న డీఈఓ

కర్నూలు(రూరల్): నగరంలోని ఎక్సెల్ అకాడమీ జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బి.సాయిఅక్షిత జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. ఆమె శుక్రవారం జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య, పరమేష్‌తో కలిసి డీఈఓ శామ్యూల్‌పాల్‌ను కలిశారు. ఈ సందర్భంగా డీఈఓ క్రీడాకారిణి సాయి అక్షితను అభినందించారు. గొందిపర్ల గ్రామానికి చెందిన సాయిఅక్షిత గత నవంబర్ 24, 25 తేదీల్లో అనంతపురం పట్టణంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 కరాటేలో రాష్ట్రస్థాయిలో సత్తా చాటి బంగారు పతాకం సాధించినట్లు వారు చెప్పారు. ఆమె ఈ నెల 8, 9, 10 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీల్లో పాల్గొననున్నట్లు కరాటే కోచ్ జగదీష్ తెలిపారు.

సూపరింటెండెంట్ విస్తృత తనిఖీ



సెక్యూరిటీ ఆఫీసర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పందులు స్వైరవిహారం చేస్తుండడంతో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం ఆసుపత్రిలోని రేడియాలజి, మెడికల్ వార్డులు, శుశృతభవన్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, సదరం, కాలిన రోగుల విభాగం, గైనిక్ వార్డు, ఫిజియోథెరపి, పీడియాట్రిక్ విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలోకి పందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. నీరు పొంగి ప్రవహిస్తున్నా స్పందించకపోవడంపై ముగ్గురు వాటర్ మ్యాన్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని విభాగాల్లోని వాటర్ ట్యాంకుల్లో ఓవర్‌ఫ్లో గాకుండా చూసుకోవాలని ఆదేశించారు. వైద్యులతో పాటు నర్సింగ్ సిబ్బంది రౌండ్స్‌లో పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు, చికిత్స సక్రమంగా అందేవిధంగా చూసుకోవాలన్నారు. సదరం అప్రూవల్ డేటా, ఎంట్రీస్, ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ఈ-హాస్పిటల్ డిశ్చార్జ్ మాడ్యూల్ డేటా గురించి ఆరా తీశారు. డేటాను త్వరగా అప్‌లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని నర్సింగ్ సిబ్బందిని ఆదేశించారు. డ్రైనేజీ పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. పేయింగ్ బ్లాక్‌లో అధునాతనంగా రూపొందించిన నాలుగు డీలక్స్ రూమ్‌లను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్లు సునీల్‌ప్రశాంత్, రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

టిడ్కోలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు





మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, హాజరైన అధికారులు

కర్నూలు (సెంట్రల్): టిడ్కో భవన సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. టిడ్కో భవన సముదాయంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. సోమవారం నాడు జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టిడ్కో ఇళ్లు కేటాయించలేదని, మౌలిక వసతులు కల్పించాలని పలువురు అర్జీలు ఇస్తున్నారని, వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. టిడ్కో ఎస్ఈ వివరణ ఇస్తూ.. నగర శివారు జగన్నాథగట్టు వద్ద 10 వేల ఇళ్లు మంజూరయ్యాయని, అందులో 9700 ఇళ్లకు స్లాబ్ వేశామని, 2100 ఇళ్లు పూర్తయ్యాయని, మిగతావి పూర్తి చేయాల్సి ఉందన్నారు. 1,028 మందికి ఇళ్ల కేటాయింపు జరిగిందన్నారు. తాగునీటి కోసం వాటర్ ట్యాంక్, పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి ఇళ్లకు నీరు సరఫరా చేసేందుకు ఇన్లెట్, ఔట్‌లెట్ పనులు పెండింగ్ ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ.. ఉన్నతాధికారులతో మాట్లాడి ఇందుకు కావలసిన నిధులు మంజూరు చేయిస్తామని, అందుకు అనుగుణంగా డీఓ లేఖను సిద్ధం చేయాలని టిడ్కో ఎస్ఈని ఆదేశించారు. టిడ్కో కాలనీలో రోడ్లు, వీధి దీపాలు కూడా ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ కలెక్టర్‌కు వివరించారు. కాలనీలోనే రేషన్ అందించేలా కొత్త రేషన్ షాపు ఏర్పాటు చేస్తామన్నారు. నేషనల్ హైవే నుంచి టిడ్కో కాలనీ అప్రోచ్ రోడ్డుకు యూ టర్న్ లేకుండా వెళ్లేందుకు గల వీలును పరిశీలించాలని నేషనల్ హైవే అధికారులకు లేఖ ఇవ్వాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అక్కడే అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి సంబంధిత అధికారులకు పంపాలని సూచించారు. అన్ని టిడ్కో కాలనీలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులు, స్కూల్, తాగునీరు తదితర అన్ని మౌలిక వసతుల కల్పనకు సంబంధించి వివరాలు ఇవ్వాలని, ఈ అంశాలను కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మాట్లాడతానని చెప్పారు. అలాగే టిడ్కో కాలనీ నుంచి ప్రజా రవాణా కోసం బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారు. ఎమ్మిగనూరుకు టిడ్కోలో సుమారు 3 వేల ఇళ్లు పూర్తయ్యాయని, అందులో 2500 ఇళ్లను హ్యాండోవర్ చేయడం జరిగిందని, శివన్న నగర్‌లో ఉన్న వాటర్ ట్యాంకు ద్వారా నీటి సరఫరా ఇస్తున్నామని, విద్యుత్, వీధి దీపాలు ఏర్పాటు చేశామని, ఆదోనికి సంబంధించి సుమారు 4,720 ఇళ్లకు గాను 2 వేల ఇళ్లు మున్సిపల్ అధికారులకు హ్యాండోవర్ చేయడం జరిగిందని టిడ్కో ఎస్ఈ తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, ఈఈ సూర్యనారాయణ, డీఈ రవికుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు ఒక్క వినతి

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని దేవమడ గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ టీవీ రమేష్ బాబు రెవెన్యూ సదస్సు నిర్వమించారు. అయితే కేవలం ఒకే ఒక దరఖాస్తు రావడం గమనార్హం. నిరంజన్ అనే రైతు తన భూమికి హద్దులు చూపాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

కల్లూరు: మండలం పెద్దపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వడ్లోని వంకను ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకువాలని కోరుతూ సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు.

వక్ఫ్ బోర్డులో కర్నూలును విస్మరించడం దారుణం

● వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం కన్వీనర్ సయ్యద్ మహ్మద్ పీర్

కర్నూలు (అర్బన్): ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర వక్ఫ్ బోర్డు కమిటీలో కర్నూలు జిల్లాకు స్థానం కల్పించకపోవడం దారుణమని వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం కన్వీనర్ సయ్యద్ మహ్మద్ పీర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నియమించబడిన కమిటీ పట్ల ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల ముస్లిం సమాజం తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యధిక వక్ఫ్ ఆస్తులు కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోనే ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో నూతన కమిటీలో కర్నూలు జిల్లాకు స్థానం లభిస్తుందని అందరూ భావించారని, అయితే వారి ఆశలన్నీ నీరుగారిపోయాయన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని పెద్ద అవగాహన లోపంగా కర్నూలు ముస్లిం సమాజం భావిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై మరోసారి పునరాలోచించాలని, అలాగే వక్ఫ్ రక్షణ ఫోరం రాయలసీమ జోనల్ కార్యాలయాన్ని కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు సంబంధించి అత్యధిక ముతవల్లీలు కర్నూలు జిల్లాలో, రాయలసీమ ప్రాంతంలో ఉన్నారన్నారు.

స్వశక్తి మహిళా సభ ప్రారంభం

కర్నూలు (సెంట్రల్): జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ మహిళా సెల్ విభాగం ఆధ్వర్యంలో స్వశక్తి మహిళా మహాసభ ప్రారంభమయ్యింది. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కళాశాల ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ మాధురి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళా శక్తీకరణలో విద్య, నైపుణ్యాల ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. మహిళల్లో ఒత్తిడిని తగ్గించి మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎకో ఫ్రెండ్లీ విధానంలో మహిళా పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. రెండు రోజుల మహిళా సభ శనివారం కూడా కొనసాగనుంది.

పతకాలతో తిరిగిరావాలి



క్రీడా దుస్తులు పంపిణీ చేసిన డీఎస్‌డీఓ, ఎస్ఐ హుసేన్

కర్నూలు (టౌన్): పశ్చిమగోదావరి జిల్లా మాటేరు గ్రామంలో ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న 10వ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటి పతకాలతో తిరిగి రావాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ఎస్ఐ హుసేన్ సూచించారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో శుక్రవారం రాష్ట్రపోటీల్లో పాల్గొనే స్త్రీ, పురుషుల జట్లకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాస్కెట్‌బాల్‌లో ప్రతిభ చాటిన ఎంతో మంది క్రీడాకారులు ఉద్యోగాలు సాధించారన్నారు. రాష్ట్ర పోటీలను అవకాశంగా తీసుకొని రాణించాలన్నారు. బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధి దాదా బాష స్త్రీ, పురుషుల జట్లను ప్రకటించారు. పురుషుల జట్టులో సురేంద్ర, మధు, రఘు, అఫ్రిద్, సాయి, హసన్, తౌసిఫ్, ఫరూఖ్, రిషికేష్, నిహాంత్, యశ్వంత్, స్త్రీల జట్టులో మౌనిక, నవ్య, రాజేశ్వరి, హాసిని, జయశ్రీ, చరిత, జ్ఞానిత, ప్రవీణ, లత, గీత, విజయ, నివేదిత ఉన్నారు.